అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి 8లో..

గ్రానైట్ క్వారీ వద్ద వృద్ధుడి అనుమానాస్పద మృతి 7లో..



అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాం

- ఉచితంగా అందించడానికి సర్కారు యోచన
- ఇప్పటికే జిల్లా కేంద్రాలకు చేరుకున్న వస్త్రాలు
- కుట్టు బాధ్యతలు మహిళా సంఘాలకు
- రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6.67 లక్షల మంది చిన్నారులకు లబ్ధి

జగిత్యాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అంగన్ వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు యూనిఫాంలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న యూనిఫాంల మాదిరిగానే అంగన్‌వాడీ చిన్నారులకు సైతం పంపిణీ చేసేందుకు కసరత్తులు చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే జిల్లా కేంద్రాల్లోని స్త్రీ, శిశు సంక్షేమ కార్యాలయాలకు యూనిఫారాలకు సంబంధించిన వస్త్రాలను పంపారు. రాష్ట్రంలో గల 149 సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకాధికారి కార్యాలయాలు (ఐసీడీఎస్) పరిధిలో 31,711 మెయిన్, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల్లో గల సుమారు 6.67 లక్షల మంది చిన్నారులకు లబ్ధి చేకూరనుంది.

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌కు వెళ్లే చిన్నారులు సుమారు 6,66,783 మంది ఉండగా, మూడు నుంచి అయిదేళ్ల చిన్నారులు సుమారు 35,700 మంది ఉన్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల 1,037 అంగన్‌వాడీ కేంద్రాల్లో 48,717 మంది చిన్నారులు పోషకాహార లబ్ధి పొందుతున్నారు. వీరందరికి యూనిఫారాలు ఉచితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో గల స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయాలకు సంబంధిత వస్త్రాల ముల్లెలను సరఫరా చేసింది. వీటిని స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యుల ద్వారా కుట్టించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు అప్పగించనున్నారు.

అంగన్ వాడీ చిన్నారులకు ఇప్పటికే పౌష్టికాహారం అందిస్తున్న ప్రభుత్వం తల్లిదండ్రులకు మరింత చేయూత కలిగించేలా యూనిఫాం పంపిణీకి యోచిస్తుందని సంబంధిత వర్గాలు అంటున్నాయి. దీనివల్ల అంగన్ వాడీ కేంద్రాలు మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. నాలుగు వేర్వేరు రంగుల్లో దుస్తులను రూపొందించి ఒక్కొక్క చిన్నారికి రెండు జతల చొప్పున ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు సమాచారం. వీటికి సంబంధించిన డిజైన్లు సైతం నిర్ధారించి ఇప్పటికే వాటి నమూనాలను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులకు పంపారు. ప్రస్తుతం వాటి నమూనాలను జిల్లా కార్యాలయాల్లో అధికారులు ప్రదర్శిస్తున్నారు. కార్యాలయాలకు చేరుకున్న వస్త్రాలను గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఇటీవల పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు కుట్టిన పొదుపు సంఘాల మహిళలకు బాధ్యతలను అప్పగించడానికి అవసరమైన కసరత్తులు జరుగుతున్నాయి. ఒకే రకమైన యూనిఫారాలను ధరించడం వల్ల చిన్నప్పటి నుంచే పిల్లల మధ్య ఎలాంటి తారతమ్యాలు, కల్మషాలు, విభేదాలకు తావు లేకుండా కలిసిమెలిసి ఉండే అవకాశం కలుగుతుందని పలువురు అంగన్‌వాడీ టీచర్లు అంటున్నారు.



జగిత్యాల జిల్లా కేంద్రానికి చేరుకున్న వస్త్రాల ముల్లెలు

వస్త్రాలు వచ్చాయి

వాణి శ్రీ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి, జగిత్యాల



అంగన్‌వాడీ చిన్నారులకు ఉచితంగా అందిం చడానికి ప్రభుత్వం యోచిస్తున్న యూనిఫాం లకు చెందిన వస్త్రాలు జగిత్యాల జిల్లాకు చేరుకున్నాయి. యూనిఫాంలను కుట్టించే బాధ్యతలను డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు అప్పగించారు. ఇందుకు అవసరమైన ప్రభుత్వ మార్గదర్శకాలు పూర్తి స్థాయిలో అందాల్సి ఉంది. యూనిఫాం పంపిణీతో చిన్నారులకు, తల్లిదండ్రులకు బహుళ ప్రయోజనాలు అందే అవకాశాలున్నాయి.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి



చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్, జూన్ 14 : తెలంగాణ ప్రభుత్వం చిన్నారుల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్సీ శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తగా చేరిన చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అలాగే పొరండ్ల గ్రామంలో గల డీ-53బై 5 ఆర్ కెనాల్ పూడికతీత, మరమ్మతుల పనులను పరిశీలించారు.

అనంతరం జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామంలో అశోక్ అనే యువకుడు తీవ్రంగా గాయ పడగా రూ. 2 లక్షల 50 వేల ఎల్‌వోసి అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచులు జలం ధర్, సంధ్యారాణి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్‌నాయకులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



దొంతాపూర్ పాఠశాలలో చిన్నారులతో ఉపాధ్యాయులు

ధర్మపురి, జూన్ 14: మండలంలోని దొంతాపూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సరస్వతి మాతా చిత్రపటానికి పూల మాల వేసి అలంకరణ చేసి పూజ నిర్వహించారు. అనంతరం 1వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుల చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయించి మిఠాయి పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టూరి రాజేశం మాట్లాడుతూ తమ పట్ల అపారమైన నమ్మకంతో పిల్లలను పాఠశాలలో చేర్పించిన తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ పాఠశాలలను అందరు సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బట్టూరి రాజేశం, ఉపాధ్యాయులు బండారి సతీష్, సునీత, దుబ్బాసీ అనిత, సింధూజ, అంగన్‌వాడి టీచర్లు జమున, విజయ, సువర్ణ, విజయ పాల్గొన్నారు.

నంబర్ ఒక్కటే.. నెట్‌వర్క్‌లు రెండు!

మల్యాల, జూన్ 14: ఒక్కటే సెల్‌ఫోన్ నంబర్ రెండు సెల్ కంపెనీల నెట్‌వర్క్‌లలో పనిచేస్తోంది. మామూలుగా ఒక్క నంబర్ ఒక్క నెట్‌వర్క్ పరిధిలో పని చేస్తుండగా నంబర్ పోర్టబిలిటీ అయినపుడు కూడా పాత సెల్ నెట్‌వర్క్‌లో సేవలు నిలిచిన తరువాతే కొత్త నెట్‌వర్క్‌సేవలు ప్రారంభం కావాల్సి ఉంటుంది. అయితే అందుకు విరుద్ధంగా ఇక్కడ జరుగుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండల కేంద్రానికి చెందిన దూస నాగభూషణం పదేళ్లకు పైగా బీఎస్‌ఎన్‌ఎల్ నంబర్ వినియోగిస్తున్నాడు. వారం రోజుల క్రితం ఐడియాలోకి మారాడు. ఐడియాలోకి మారాక బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్ సేవలు నిలిచిపోగానే ఐడియా సేవలు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఐడియా సేవలు ప్రారంభం అయ్యాక కూడా వారం రోజులుగా బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు కొనసాగుతుండడం ఆశ్చర్యం కల్గిస్తోంది. ఇలా రెండు సెల్‌కంపెనీల సేవలు ఒక్కటే నంబర్‌కు పని చేయడం ప్రమాదకరమని కొందరు వ్యక్తులు ఏదేని క్రైమ్‌కు వినియోగించుకునే అవకాశం ఉంటుందని నాగభూషణం ఈ సందర్భంగా అభిప్రాయపడ్డాడు.

టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం



హుస్నేన్‌ను సన్మానిస్తున్న జగిత్యాల నాయకులు

జగిత్యాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన హుస్నేన్‌ను పలువురు జిల్లా టీఎన్జీవో నేతలు సన్మానించారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని నాంపల్లిలో గల టీఎన్జీవో రాష్ట్ర కార్యాలయంలో జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన హుస్నేన్‌ను పూలమాలలు, శాలువలతో సత్కరించారు. జగిత్యాల జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు బోగ శశిధర్, కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు యండీ వకీలు, రవీందర్, మధుకర్, సురేందర్, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

ప్రజా సేవతోనే ప్రజా ప్రతినిధులకు గుర్తింపు

ప్రజా ప్రతినిధుల చివరి సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ వసంత



జడ్పీ చైర్‌పర్సన్‌తో ఎంపీపీ,ఎంపీటీసీలు,అధికారులు

సారంగాపూర్, జూన్, 14 : ప్రజలకు చేసిన సేవతోనే ప్రజా ప్రతినిధులకు గుర్తింపు లభిస్తుందని జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవి కాలం వచ్చే నెల 5తో ముగియనుండటంతో ఎంపీపీ, కోల జమున అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత హజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సేవ చేయడం అదృష్టంగా భావించి ఎప్పటి కప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరించి సేవ చేసినట్టయితే ప్రజలు ఆదరిస్తారన్నారు.

సారంగాపూర్ మండల ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ జిల్లాలోనే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. మళ్లీ ప్రజా సేవ చేసేందుకు ఏదో ఒక హోదాలో మళ్లీ ప్రజా పరిషత్ కార్యాలయానికి రావాలని ఆకాక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, సమన్వయంతో పని చేస్తూ తమకు సహకరిస్తూ మండల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. పదవీ కాలం ముగిసినా కుటుంబ సభ్యుల మాదిరిగా ఫోన్‌లో మాట్లాడుతూ యోగ క్షేమాలు తెలుసుకోవాలని ప్రజా ప్రతినిధులకు, అధికా రుతో అన్నారు. అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ ఏనాడు కూడ తాను జడ్పీటీసీ హోదాలో అహంకారంతో ఉండ లేదని అందిరిలో ఒకడిగా ఉంటూ బాధ్యతలో ఉన్నానని జడ్పీటీసీ హోదాలో ఉన్న తీపి గుర్తులను గుర్తు చేశారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్‌ను ప్రజా ప్రతినిధులు, అధికారులు శాలువతో సన్మానించారు. ఎంపీపీ కోల జమున శ్రీనివాస్‌ను, ఆయా గ్రామాల ఎంపీటీసీ, జడ్పీటీసీని శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోల జమున శ్రీనివాస్, జడ్పీటీసీ మనో హర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సురేందర్, ఎంపటీసీలు, సుధాకర్‌రావు, మానాల ప్రసన్న మాల, లావణ్య, మమత, విమల,ఎంపీడీవో లచ్చాలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చ'లో దట్నూర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

గొల్లపల్లి, జూన్ 14 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చ -24 కార్యక్రమంలో మండలంలోని దట్నూర్ యూపీఎస్ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రశంసా పత్రాలను అందుకున్నారు. నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా చేపట్టిన పరీక్షా పే చర్చ- 24 కార్యక్రమంను ఆన్‌లైన్‌లో నిర్వహించగా పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా 10 మంది విద్యార్థులు ప్రతిభను కనబర్చి ఆన్‌లైన్‌లో న్యూ ఢిల్లీ నుంచి ప్రశంసా పత్రాలు రాగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జూపాక సుదర్శన్ శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించడంతో పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను చాటారని ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ ఆకుల పావనినగేష్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దుంపేటి మంగ, ఉపాధ్యాయులు హరికృష్ణ, లక్ష్మీనర్సయ్య, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధుయాష్కి గౌడ్‌ను కలిసిన జగిత్యాల నేతలు

జగిత్యాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, నిజామాబాద్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌ను శుక్రవారం జగిత్యాలకు చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కలిశారు. హైద్రాబాద్‌లోని తన నివాసంలో జగిత్యాలకు చెందిన సీనియర్ న్యాయ వాది, టీపీసీసీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గుంటి జగదీశ్వర్‌తో పాటు పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. జిల్లాలో కాంగ్రెస్ రాజకీయాలు వీరి మధ్య చర్చకు వచ్చాయి.

నామినేటెడ్ పదవిల భర్తీల వ్యవహారంలో ఎస్సీ, బీసీ వర్గాలకు తగిన న్యాయం జరిగేలా సహకరించాలని కోరారు.

ఎన్‌పీడీసీఎల్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

జగిత్యాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అయిదేళ్లుగా ఎన్‌పీడీసీఎల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పదోన్నతుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సంస్థ సీఎండీ వరుణ్ రెడ్డికి పలువురు ఉద్యోగ సంఘ నాయకులు వినతిపత్రం సమర్పించారు. హైద్రాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం సీఎండీ వరుణ్ రెడ్డిని పలువురు కలిసి సమస్యను విన్నవించారు. జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రాంజీ నాయక్, ఇతరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మున్నా

రాయికల్, జూన్ 14: రాయికల్ పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు మహ్మద్ ముస్తాక్ అహ్మద్ మున్నా జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నాడు. మున్నా సామాజిక సేవలో, బ్లడ్ మోటివేటర్ గా అందించిన సేవలను గుర్తించి ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మున్నాను జిల్లా ఫారెస్ట్ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో సమీయొద్దీన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్, పోషక ఆహార నిపుణులు రిచాశ్రీ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సెక్రటరీ, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కృష్ణ అభినందించారు.

కేంద్ర మంత్రులను కలిసిన నాయకులు



కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కోరుట్ల, జూన్ 14 : పట్టణంలోని 31వ వార్డు కౌన్సిలర్ పెండం గణేష్ శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసి సన్మానించి అభినందించారు. ఢిల్లీలోని హోంశాఖ సహాయ మంత్రి చాంబర్‌లో బండి సంజయ్‌ను కలిసి పూలమాలలు శాలువాలతో సత్కరించారు. పట్టణంలోని 31వ వార్డులో ఉన్న దుర్గా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించిన తిలకంతో పాటు అమ్మవారి కప్పి పూజ చేసిన శాలువాను మంత్రి బండి సంజయ్‌కు అందజేశారు. స్థానికంగా ఉన్న పార్టీ పరిస్థితిని బండి సంజయ్‌కు వివరించినట్లు గణేష్ తెలిపారు.

●కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులను శుక్రవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్ రావు కలిసి సన్మానించాడు. ఢిల్లీలోని కేంద్ర మంత్రుల చాంబర్‌లో మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానికంగా ఉన్న పార్టీ పరిస్థితిలతో పాటు చేయవలసిన పార్టీ కార్యక్రమాలను కేంద్ర మంత్రులకు వివరించినట్లు తెలిపారు.

కొడిమ్యాల : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కొడిమ్యాల మండల బీజేపీ నాయకుడు, మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామ మాజీ సర్పంచు డబ్బురాధ భర్త డబ్బు గౌతంరెడ్డి శుక్రవారం ఢిల్లీలోని మినిస్టర్ క్వాటర్‌లో మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందించారు. కొడిమ్యాల మండల అభివృద్ధికి కృషి చేయాలని సహాయ మంత్రిని కోరినట్లు గౌతంరెడ్డి తెలిపారు. కరీంనగర్ ఎంపీ సామాన్య కార్యకర్త నుంచి కేంద్ర సహాయ మంత్రిగా ఎదగటం బీజేపీ కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజల మధ్య ఉంటు ప్రజల సమస్యల పరిష్కారమె ధ్యేయంగా మీరు ముందుండాలని మా ప్రాంతం అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరినట్లు తెలిపారు.

కథలాపూర్: కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో శుక్రవారం బీజేపీ నాయకులు ఢిల్లీలో కలిసి అభినందిచారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపా లోరెడ్డి, ఎడ్మల వినోదరెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ స్థాయి నుంచి మంత్రిగా ఎదగడం గర్వకారణమని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 14: ఆత్మహత్యకు యత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివరాత్రి సమ్మయ్య(42) గురువారం రాత్రి మృతి చెందాడు. కాలనీ షిర్కే సులభ్ కాంప్లెక్స్ కార్మికుడిగా పనిచేస్తున్న సమ్మయ్య ఆర్థిక ఇబ్బందులను మానసిక క్షోభతో మద్యానికి బానిస అయ్యాడు. ఈక్రమంలో గురువారం తెల్లవారు జామున ఆత్మహత్య చేసుకోవాలని సులబ్ కాంప్లెక్స్ శుభ్రతకు వాడే యాసిడ్‌ను తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 సాయంతో గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందతూ గురువారం రాత్రి సమ్మయ్య మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్స్‌లో రెవెన్యూ అధికారుల తనిఖీ

- 14 డొమెస్టిక్ సిలిండర్లు పట్టివేత

ధర్మపురి, జూన్ 14: ధర్మపురి పట్టణంలోని పలు హోటల్స్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వెంకటేష్, రాజేంద్రప్రసాద్, మల్యాల డీటీసీఎస్ శ్రీనివాస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటల్ యజమానుల వద్ద నుంచి 14 డొమెస్టిక్ సిలిండర్లను పట్టుకున్నారు. అనంతరం డొమెస్టిక్ సిలిండర్లు కలిగి ఉన్న యజమానులపై 6ఏ కేసు నమోదు చేశారు. అనంతరం ఆర్ఐ వెంకటేష్ మాట్లాడుతూ సబ్సిడీపై గృహ అవసరాలకు ఇచ్చే సిలిండర్లను వాణిజ్యపరమైన అవసరాలకు వినియోగించడం నేరమని అన్నారు. వాణిజ్య అవసరాలకు ప్రత్యేకమైన సబ్సిడీ లేని సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీల నుంచి తీసుకొని వాడుకోవాలని హోటల్ నిర్వాహకులకు ఆయన సూచించారు.

వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్య

- సూసైడ్ నోట్ లభ్యం

ఇబ్రహీంపట్నం, జూన్ 14: అప్పు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రాయించుకుని నిరంతరం వేధింపులకు పాల్పడటంతో భరించలేక మండల కేంద్రానికి చెందిన సున్నం రవి (42) అనే వ్యక్తి శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలంలో రవి జేబులో లభ్యమైన సుసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఇబ్రహీంపట్నంకు చెందిన రెబ్బటి రాజేందర్ అనే వ్యక్తి రవికి రెండు లక్షల రూపాయలు అప్పుగా ఇవ్వకుండానే ఇచ్చినట్లు బెదిరించి కొట్టి సంతకం తీసుకున్నాడు. అదే విధంగా గ్రామానికి చెందిన కనక జగన్, చెప్పుల శ్రీనివాస్, గంట గణేష్‌లు రవి వద్ద అప్పులు తీసుకుని చెల్లించడం లేదు. డబ్బులు అడిగినప్పుడల్లా చంపుతామంటూ రవిని బెదిరిస్తూ వస్తున్నారు. ఓ వైపు రవి ఇప్పుగా ఇచ్చిన డబ్బులు రాకపోవడం, మరోవైపు అప్పు తీసుకోకున్నా డబ్బులు చెల్లించాలంటూ రాజేందర్ నుంచి వేధింపులు పెరగడంతో రవి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు.

ఈ క్రమంలో చేసేది లేక చివరికి సూసైడ్ నోట్ రాసి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. రవికి ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు. రవి మృతితో గ్రామంలో విషాదం నిండుకుంది. రవి మృతికి కారుకులైన వారి చట్టపరంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

కుక్కల దాడిలో ఐదుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 14: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి శుక్రవారం సాయంత్రం ఇంటికి వెళుతున్న ఐదుగురు విద్యార్థులపై రెండు కుక్కలు దాడి చేశాయి. ఈ సంఘటనలో విద్యార్థులు వర్ష, రమేశ్, ప్రవళికతో పాటు మరో ఇద్దరు విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. అక్కడే ఉన్న వ్యక్తులు అప్రమత్తమై కుక్కలను కర్రలతో వెళ్లగొట్టడంతో పారిపోయాయి. క్షతగాత్రులను స్థానిక ఓ పీఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని ప్రజలు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శునకాల బారి నుంచి తమతో పాటు పిల్లలను రక్షించాలని తల్లిదండ్రులు కోరారు.

ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీ

- యువకుడి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

రుద్రంగి, జూన్ 14: ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి ఈ సంఘటన రుద్రంగి మండల కేంద్రం శివారులోని కలిగోట తండా మూలమాలుపు వద్ద శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన బిల్లవేణి (గండి) గంగాధర్ - రాయమల్లు దంపతుల కుమారుడు గండి అజయ్(19) అనే యువకుడు, ఇదే గ్రామానికి చెందిన బోయిని అభిషేక్ అనే యువకుడితో కలిసి కథలాపూర్ మండలానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి రుద్రంగి వస్తున్న సమయంలో రుద్రంగి శివారులోని కలిగోట తండా మూలమాలుపు వద్ద రుద్రంగి నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో బైక్ నడుపుతున్న బోయిని అభిషేక్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెనుకాల కూర్చున్న గండి ఆజేయ్ ఆనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన అభిషేక్‌ను చికిత్స కోసం వేములవాడ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సిరిసిల్ల అశోక్ పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.


అజయ్(ఫైల్)

● **బోనాల పండగ పూట విషాదం..**

పెద్దమ్మ బోనాల పండగ పూట ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. పండగ పూట పని నిమిత్తం వెళ్లిన యువకులు తిరిగి వస్తున్న క్రమంలో రుద్రంగి శివారులో మూలమాలుపు వద్ద ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో అజయ్ అక్కడికక్కడే మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. పండగ పూట సంతోషంగా ఉండాల్సిక కుటుంబం ఒక్కగానొక్క కూమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు ముందు భాగం, చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆర్టీసీ బస్సు.. వ్యాన్ ఢీ

- ఐదుగురికి తీవ్రగాయాలు

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం నేరెళ్ల శివారులో ఆర్టీసీ బస్సు, వ్యాన్ శుక్రవారం ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరబాద్ నుంచి సుమారు 20 మంది ప్రయాణికులతో వేములవాడకు వెళ్తుండగా నేరెళ్ల శివారులో ప్రమాదకరమైన మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ మక్బుల్ (55), సిరిసిల్లకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఇంద్రసేనారెడ్డి (46), బస్సులో ప్రయాణికులు కథలాపూర్ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన వైశాలి (18), గంభీరావుపేటకు చెందిన శశాంక్ (33), వేములవాడకు చెందిన పుల్కం లక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 వాహనంలో జిల్లా ప్రధాన అసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మధ్యాహ్నం వర్షం కురుస్తుండగా నేరెళ్ల శివారులోని ప్రమాదకరమైన మూలమలుపు వద్దకు సుమారు 20 మంది ప్రయాణికులతో బస్సు చేరుకోగానే అతివేగంగా ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొట్టడంతో సుమారు యాభై మీటర్ల వరకు బస్సును నెట్టుకుంటూ వెళ్లగా చెట్టును ఢీకొట్టి ఆగిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చెట్టును ఢీకొని బస్సు ఆగడంతో పెను ప్రమాదం తప్పిందని లేకుంటే బస్సు బోల్తా పడేదని సత్యనారాయణ అనే ప్రయాణికుడు తెలిపాడు. సంఘటన స్థలానికి డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● **తరుచూ ప్రమాదాలు..**

సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై ప్రమాదకరమైన మూలమలుపులు చాలా ఉన్నాయి. మూలమలుపుల్లో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదకరమైన మూల మలుపులు ప్రయాణికుల పాలిట శాపంగా మారాయి. మూలమలుపుల వద్ద రోడ్డు వెడల్పు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

మావోయిస్టు దంపతుల లొంగుబాటు


లొంగిపోయిన మావోయిస్టు దంపతులకు రివార్డు అందజేస్తున్న సీపీ అభిషేక్ మోహంతి

కరీంనగర్ క్రైం, జూన్ 14 సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు పార్టీకి చెందిన ఏరియా కమిటీ సభ్యులు తిక్క సుశ్మిత అలియాస్ చైతె, మడకం దూల అలియస్ దూల శుక్రవారం పోలీసులకు లొంగిపోయారు. వీరిద్దరు దంపతులు. ఈ మేరకు వరంగల్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి కరీంనగర్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. సెంట్రల్ కమిటీ మెంబర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇన్‌చార్జి వద్ద సుశ్మిత సెంట్రల్ కమిటీ స్టాఫ్‌గా, దూల ప్రొటక్షన్ టీం మెంబర్‌గా పని చేశాడని సీపీ తెలిపారు. హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సుదంపల్లి గ్రామానికి చెందిన తిక్క సుశ్మిత(27) ఇంటర్మీడియేట్ వరకు చదువుకుంది. ఆమె తండ్రి తిక్క సుదాకర్ మావోయిస్టు సానుభూతి పరుడిగా పనిచేశాడు. తండ్రిని చూసి మావోయిస్టు పార్టీకి ఆకర్షితులరాలైన సుశ్మిత తన చదువు అనంతరం 2016వ సంవత్సరంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కొమటిపల్లి గ్రామం అటవీ ప్రాంతంలో బడె చొక్కారావు అలియాస్ దామోదర్ సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా పర్య గ్రామానికి చెందిన మడకం దూల ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆయన సోదరుడు ఐయేత 2008లో సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరాడు. అతడిని చూసి ఆకర్షితుడైన దూల 2015లో ఏరియా కమిటీ మెంబర్ అయిన జోగి ప్రోత్సాహంతో మావోయిస్టు పార్టీలో చేరాడు. మావోయిస్టు పార్టీలో చేస్తున్న సమయంలో సుశ్మిత, దూలల మధ్య పరిచయం ఏర్పడి 2020 మార్చి30న వివాహం చేసుకున్నారు. తరువాత వివిధ హోదాల్లో మావోయిస్టు పార్టీలో పని చేశారు. మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోయి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకం గురించి తెలుసుకుని ఆకర్షితులై లొంగిపోయారని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. ఒక్కొక్కరిపై నాలుగు లక్షల రూపాయల రివార్డు ఉందని చెప్పారు. ఆ మొత్తాన్ని మావోయిస్టు దంపతులకు సీపీ బ్యాంకు డీడీ రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టులు అజ్ఞాతం వీడి, హింసను వదిలి పెట్టి సమాజంలో కలిసిపోయి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పి తిరుమల్, హసన్‌పర్తి సీఐ జె సురేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లందకుంట, జూన్ 14: మండలంలోని బూజూనూర్ గ్రామ శివారులో మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ శుక్రవారం తెలిపారు. జమ్మికుంట మానేరు పరివాహక ప్రాంతం నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇల్లందకుంట మండలంలోని బూజూనూర్ గ్రామం గుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

మల్యాల, జూన్ 14: మండలంలోని కొండగట్టు, బల్వంతాపూర్ శివారులో నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్ రహీం శుక్రవారం తెలిపారు. వాహనాల యజమానులు మురళి, రవీందర్ డ్రైవర్లు కోను మహేష్, శివరాత్రి లక్ష్మణ్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గత మంగళవారం కూడా అక్రమంగా మట్టి తరలిస్తున్న అయిదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినప్పటికీ మట్టి అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది.

డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడపాలి

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం

భగత్‌నగర్, జూన్ 14: డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులను నడిపించాలని, ఆర్టీసీ డ్రైవర్లకు అనుభవజ్ఞులైన డ్రైవర్లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పురుషోత్తం అన్నారు. ప్రతి త్రైమాసికంలో ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందించడంతో డ్రైవర్లకు ఉత్తేజం కలుగుతుందన్నారు. కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి వినోద్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ జోన్‌కు ఎంతో చరిత్ర ఉందని, రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. సిబ్బంది కృషి ఫలితంగానే సాధ్యమవుతుందన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి ఎంతో పేరు వచ్చిందన్నారు. కరీంనగర్ జోన్‌కు ప్రతి రోజు 5.05 కోట్లు లక్ష్యం కాగా ప్రతిరోజు 5.14 కోట్లు ఆర్జిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో డీలక్స్ ఆపై సర్వీసులలో ఆదాయాన్ని పెంపొందించుకొనుటకు కృషి చేయాలన్నారు. ప్రతి డ్రైవర్ ఏకాగ్రతతో బస్సులను నడిపించాలన్నారు. సెల్‌ఫోన్ వాడరాదని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత ప్రతి డ్రైవర్‌పై ఉందన్నారు. రీజినల్ మేనేజర్ సుచరిత మా ట్లాడుతూ ఉత్తమ ప్రతి కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లు గ్యారెజీ సిబ్బంది సూపర్‌వైజర్లకు ప్రగతిచక్ర అవార్డులు అందించడం జరుగుతుందన్నారు. అవార్డులు సాధించిన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. 3వ త్రైమాసికంలో 60 మంది ఉద్యోగులకు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానికల్) కె సత్యనారాయణ, (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, రీజియన్‌లోని అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్, మెకానికల్ సూపర్‌వైజర్లు, సేఫ్టీ వార్డెన్స్ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్లు, వెల్‌ఫేర్ బోర్డు కమిటీ సభ్యులు, రీజినల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అవార్డులు అందుకున్న ఉద్యోగులతో ఆర్టీసీ అధికారులు

ప్రభుత్వ అంధుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

కరీంనగర్ టౌన్, జూన్ 14: జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట గల ప్రభుత్వ అంధుల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను 1 నుంచి ఐదో తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం, 1 నుంచి పదో తరగతి వరకు తెలుగు మీడియంలో విద్యాబోధన చేయడంతో పాటు ఉచితంగా భోజన వసతి కూడా కల్పిస్తామని చెప్పారు. అలాగే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రూపొందించిన కంప్యూటర్, వివిధ కళల్లో కూడా విద్యార్థులకు శిక్షణ అందిస్తామని అన్నారు. ఆరు నుంచి 14 ఏళ్ల వయసు కలిగిన బాలబాలికలు ఈ పాఠశాలలో ప్రవేశం తీసుకోవచ్చని అన్నారు. మెడికల్ బోర్డు జారీ చేసిన సదరం సర్టిఫికెట్‌లో 40 నుంచి 100శాతం అంధత్వం కలిగిన విద్యార్థులకు మాత్రమే అర్హత ఉంటుందని తెలిపారు. కరీంనగర్ జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన అంధ విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఉపాధ్యాయులు, సర్పంచ్‌లు, గ్రామకార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను కోరారు. ఇతర వివరాలకు ఫోన్: 9494317315, 9701190124, 7396206959, 944033 8424 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య

సుల్తానాబాద్, జూన్ 14: సుల్తానాబాద్ రైస్‌మిల్లుల ప్రాంతంలో ఆరేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన అమానుషమైన ఘటన చోటుచేసుకుంది. సుల్తానాబాద్-కాట్నపల్లి మధ్య రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న ఓ రైస్‌మిల్లులో పని చేయడానికి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన చెందిన దంపతులు వారం రోజుల క్రితం వచ్చారు. వారికి ఆరేళ్ల, ఏడాది వయస్సుగల ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గురువారం రైస్‌మిల్లుకు చెందిన లేబర్ రూముల్లో కరెంట్ పోవడంతో ఉక్కపోత భరించలేక తమ ఇద్దరు చిన్నారులతో సహా గది ముందు భాగంలో నిద్రపోయారు. కొంతసేపటి తర్వాత తమ పెద్ద కూతురు కనిపించకపోవడంతో చిన్నారి తల్లి విషయాన్ని భర్తకు తెలిపింది. అతడు మిల్లులోని తోటి కార్మికులతో కలిసి మిల్లుతోపాటు చుట్టుపక్కల వెతుకుతూ డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తి చిన్నారిని భుజాన వేసుకుని వెళుతున్న దృశ్యాలు కనిపించాయి. అప్పటికే పోలీసులు గాలిస్తుండగా చిన్నారి అపహరణకు గురైన మిల్లును ఆనుకుని ఉన్న మరో మిల్లులో తెల్లవారుజామున దుస్తులు ఉతుకుతూ ఓ కార్మికుడు కనిపించాడు. కార్మికులు, పోలీసులు అతడిని విచారించడంతో నిందితుడని తేలింది. అతడు ఈనెల 6న మిల్లులో పనికి చేరాడని తోటి కార్మికులు తెలిపారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా, మిల్లు వెనక వైపు చెట్ల పొదల్లో అత్యాచారం చేసి, హత్య చేసినట్లు తేలిపాడు. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● **ఘటనా స్థలానికి పోలీస్ ఉన్నతాధికారులు**

చిన్నారిపై అత్యాచారం, హత్య చేసిన కేసుకు సంబంధించిన ఘటనా స్థలాన్ని రామగుండం కమిషనరేట్ పరిధిలోని పలువురు ఉన్నతాదికారులు పరిశీలించారు. పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీ కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తో పాటు పలువురు అధికారులు సుల్తానాబాద్‌కు చేరుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● **నిందితుడి అరెస్టు**

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనరేట్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఓ రైస్ మిల్లులో బీహార్ రాష్ట్రానికి చెందిన నిందితుడు హమాలీగా పని చేస్తున్నాడని పేర్కొన్నారు. గురువారం రాత్రి కరెంట్ పోవడంతో నేరస్తుడు బయటకు వచ్చి బాలిక, తల్లిదండ్రులు రూమ్ బయట పడుకున్న విషయాన్ని గమనించాడన్నారు. చిన్నారిని అక్కడి నుంచి ఎత్తుకెళ్లి రైస్‌మిల్లు వెనుక ప్రాంతంలో అత్యాచారం చేసి చంపి పారిపోయాడని పేర్కొన్నారు. స్థానికుల సమాచారంతో సుల్తానాబాద్ పోలీసులు పట్టుకున్నారని ప్రకటనలో పేర్కొన్నారు.

మూగ యువతిపై అత్యాచారం

సంఘటనాస్థలిని పరిశీలించిన డీఎస్పీ, సీఐ

గొల్లపల్లి, జూన్ 14: గొల్లపల్లి మండలంలోని ఓగ్రామంలో మూగ యువతి (21)పై అత్యాచారం జరగగా, సంఘటనా స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై చిర్ర సతీష్ కుమార్ పరిశీలించి నిందితుడిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వికలాంగురాలైన యువతిని తీసుకుని శ్రీనివాస్ అనే యువకుడు పనుల నిమిత్తం గొల్లపల్లి మండల కేంద్రానికి తన ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి తిరిగి వస్తున్నారు.

ఈ క్రమంలో గోవిందుపల్లె రెవెన్యూ శివారులోని ఓ మామిడితోటలోకి యువతిని బలవంతంగా తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో బాధిత యువతి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గాలివాన బీభత్సం

- విరిగిన చెట్లు - లేచిపోయిన రేకుల షెడ్లు


జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారిపైకి వంగిన చెట్టు

గొల్లపల్లి, జూన్ 14: గొల్లపల్లి మండలంలో భారీ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన శుక్రవారం బీభత్సంను సృష్టించింది. సుమారు గంటపాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో ఈదురుగాలుల తాకిడికి చెట్లు నేలకు విరిగిపడగా, పలువురు నిరుపేదలకు చెందిన రేకుల షెడ్లు కొట్టుకుపోయి నిరాశ్రయిలయ్యారు. పలుచోట్ల చెట్లు రోడ్డు విరిగిపడ్డంతో వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. మరికొన్ని చోట్ల రోడ్ల పై చెట్లు విరిగిపడ్డంతో వాహనాదారులకు ప్రమాదభరితంగా మారాయి. భారీ వర్షానికి పలుచోట్ల రోడ్లు జలమయం కాగా, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇదిలా ఉండగా, మండలంలో తొలకరి పలకరింపుతో రైతన్నల మోము పులకరించింది. వేసవి కాలం భానుడి భగభగలతో, తీవ్ర ఉక్కపోతతో సతమైన జనం ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడడంతో జనాలకు ఉపశమనం లభించినట్లయింది.

చందుర్తి: చందుర్తి మండలం ఎనగల్, మరిగడ్డ, నర్సింగాపూర్, మూడపల్లి గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఎనగల్, మూడపల్లిలో భారీ వర్షం కురిసింది. గాలివానకు పలు చోట్ల రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి.

పిడుగుపాటుకు గేదె మృతి..

మండలంలోని ఎనగల్ గ్రామంలో పాడి రైతు పకిడే రాజయ్యకు చెందిన గేదే పిడుగుపాటుకు మృతి చెందింది. ఎల్లమ్మ ఆలయ సమీపంలోని చెట్టు వద్ద గేదెని కట్టివేయగా పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ దాదాపు రూ. 50 వేల వరకు ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కొడిమ్యాల: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి, శుక్రవారం మద్యాహ్నం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలి వీయటంతో మండలంలోని సంద్రల్లపల్లి గ్రామానికి చెందిన మర్రిపల్లి శంకర్ పశువుల కొట్టం కూలింది, పైకప్పు లేచి పక్కన ఉన్న ఇంటిపై పడింది. దీంతో ఇంటిలోని చిందరవందరగా మారాయి. సుమారు రెండు లక్షల రూపాయల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బీర్‌పూర్,జూన్ 14: మండల కేంద్రంలోని రోళ్ల వాగు సమీపంలో శుక్రవారం సగం కాలిన స్థితిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం అయ్యింది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి సిబ్బందితో చేరుకున్న జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఆనవాళ్ల కోసం చుట్టు పక్కల ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహం సగానికిపైగా కాలిపోయి ఉండటంతో వ్యక్తి ఎవరు అనేది గుర్తించడం కష్టంగా మారింది. గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేసి మృతదేహాన్ని కాల్చి ఉంటారా లేదా ఎవరైనా ఆత్మహత్య కు పాల్పడి ఉంటారా అన్నసందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

వ్యక్తిపై కేసు నమోదు

పాలకుర్తి,జూన్ 14: మండలం పరిధిలోని కన్నాల గ్రామానికి చెందిన పుట్ట రంజిత్‌పై కేసు నమోదైంది. ఇటీవల రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్‌పై, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై సోషల్ మీడియాలో రంజిత్ అనుచిత వ్యాఖ్యలు చేశాడని భూతగ డ్డల రమేష్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పుట్ట రంజిత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు.

గ్రానైట్ క్వారీ వద్ద వృద్ధుడి అనుమానాస్పద మృతి

● మృతదేహంతో గ్రామస్థుల ఆందోళన
● రూ.6లక్షలు చెల్లించిన క్వారీ యాజమాన్యం

మల్యాల, జూన్ 14: మండలంలోని బల్వంతాపూర్ గ్రామ శివారులో గల గ్రానైట్ క్వారీ వద్ద ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి తలపై గాయాలు ఉండడంతో మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ గ్రానైట్ క్వారీ వద్ద మృతదేహంతో గ్రామస్థులు ఆందోళన చేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బల్వంతాపూర్‌కు చెందిన నెలబొయిన పర్శయ్య(65) గురువారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు రాగా అతని మృతదేహం గ్రామశివారులోని మారుతీ గ్రానైట్ క్వారీ వద్ద శుక్రవారం వేకువజామున కొందరు గుర్తించారు. దీంతో అక్కడి సిబ్బంది మృతి విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. అక్కడకు చేరుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్థులు వృద్ధుడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. మృతుడి తలపై గాయాలు ఉండడంతో ఓపెన్ బ్లాస్టింగ్‌తో రాళ్లు ఎగిరిపడడంతోనే మృతి చెందాడని బ్లాసింగ్ సమయంలో నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదం చోటు చేసుకుందని గ్రామస్థులు మండిపడ్డారు. మృతదేహాన్ని బట్టి చూస్తే క్వారీలో జరిగిన ప్రమాదమేనని మృతుడి కుటుంబసభ్యులను ఆదుకోవాలని గ్రామస్థులు నక్క అనిల్, రమేష్ డిమాండ్ చేశారు. క్వారీ వద్ద రక్షణ చర్యలు లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని, రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో దాదాపు మూడు గంటల పాటు ఆందోళన చేశారు. మల్యాల సీఐ నీలం రవి, ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి అక్క డకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గ్రామస్థుల ఆందోళన నేపథ్యంలో క్వారీ యాజమాన్యం మృతుడి కుటుంబసభ్యులకు ఆరు లక్షల రూపాయలు చెల్లించ డంతో ఆందోళన విరమించినట్లు గ్రామస్థులు తెలిపారు. పర్శయ్య కొడుకు నరేష్ తన తండ్రికి కొన్నాళ్లుగా మతిస్థిమితం సరిగా లేదని అందులో భాగంగానే గురు వారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లగా క్వారీ వద్ద తలపై బండ పడడంతో గాయా లై మృతి చెందాడని తమకు ఎలాంటి అనుమానాలు లేవని పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోలీసులు జగిత్యాలకు తరలించారు.


ఆందోళన చేస్తున్న గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ

మోదీ ప్రభుత్వంలో నేరారోపణలు ఉన్న మంత్రులు ఉండడం దారుణం


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి, జూన్ 14: ప్రదానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వంలో ఇటీవల నియమించిన కేంద్ర మంత్రుల్లో నేరారోపణలు ఉన్న వారు ఉండడం దారుణమ ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ఇటీవల దేశంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ శాతం మంది అనేక అత్యాచారాలు, ఆర్థిక నేరాలకు పాల్పడిన వారు, ఇతర క్రిమినల్ కేసుల్లో 259 మంది నేరారోపణలు ఉన్నవారు ఎన్నికల్లో గెలిచారన్నారు. ప్రస్తుతం 18 మంది కేంద్ర మంత్రులు కూడా నేరాలకు పాల్పడినట్లు అరోపణలు ఉన్నాయన్నారు. దేశంలో మోదీ సొంత పాలన చేస్తూ 750 మంది రైతులను బలి తీసుకున్నారని ఆరోపించారు. అనేక ఉద్యమాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాసిన నియంత మోదీ అని అన్నారు. ఇప్పటికైనా రాజ్యాంగ ప్రకారం దేశ ప్రజలకు పాలన అందించి అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులను అందించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిర్వమించిన విధంగా ప్రజాదర్బార్ నిర్వహించి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంతరెడ్డి ప్రజల మన్నలను పొందేలా కృషి చేయాలని అన్నారు. ప్రజాదార్బర్ ద్వారా ప్రజలతో, పాటు నాయకులను కలిసి అనేక ప్రజా సమస్యలను తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, ముద్రకోల రాజయ్య, తెరాల సత్యనారాయణ, బూడిద సదాశివ, కంది రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక 'విద్యుత్ ప్రజావాణి'

- ఎన్పీడీసీఎల్‌లో ప్రతీ సోమవారం నిర్వహణ

హనుమకొండ టౌన్, జూన్14: విద్యుత్ వినియోగదారులకు చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా వారి ఫిర్యాదులు తీసుకొని సకాలంలో పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో ప్రతీ సోమవారం 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి అన్నారు. ప్రతీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు 16 సర్కిళ్ల పరిధిలోని డివిజనల్ ఆఫీస్, సబ్‌డివిజనల్ ఆఫీస్, ఈఆర్వో సెక్షన్ ఆఫీస్‌లలో, అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్కిల్ ఆఫీస్‌లలో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేలా చూస్తామన్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లోని పోర్టల్‌ను కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌ల కు అనుసంధానం చేసి విద్యుత్ ప్రజావాణి అనే మరొక పోర్టల్‌ను ఏర్పాటు చేసి వినియోగదారులకు మరింత చేరువ చేస్తున్నామని సీఎండీ వెల్లడించారు.

బేగంపేట్‌లో టాస్క్‌ఫోర్స్ దాడులు

రామగిరి, జూన్ 14: మండలంలోని బేగంపేట్ గ్రామంలో గుడుంబా స్థావరాల పై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేపట్టారు. రామగుండం సిపి ఆదేశాల మేరకు గ్రామ శివారులోని కంచల చెరువు సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న గుడంబా స్థావరాలను గుర్తించారు. స్థావరాల్లోని వెయ్యి లీటర్లబెల్లం పానకం, సామాగ్రిని ధ్వంసం చేశారు. సీఐ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడులు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7,250 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 14: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7250 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 12మంది రైతులు 130క్వింటాళ్లు విడి పత్తి, ముగ్గురు రైతులు రెండు క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7250, కనిష్ఠ ధర రూ.6500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. 15,16న సాధారణ సెలవు ధినాలు కాగా, 17న భక్రీద్, 18న ఉర్సు ఉత్సవాల జాతర సందర్భంగా మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించడం జరిగిందని, తిరిగి బుధవారం కొనుగోళ్లు ప్రారంభం అవుతాయని తెలిపారు.

నల్లగొండ వాసికి బెస్ట్ మోటివేటర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రవీందర్

కొడిమ్యాల, జూన్ 14 : రక్తదానం చేస్తూ ఇతరులను ప్రోత్సహిస్తున్నందుకు శుక్రవారం హైదరాబాదులోని రాజ్‌భవన్‌లో తెలంగాణ రెడ్ క్రాస్ ఛైర్మన్ అజయ్‌మిశ్రా (ఐఏఎస్) చేతుల మీదుగా బెస్ట్ మోటీవేటర్ అవార్డును మండలంలోని నల్లగొండ గ్రామానికి చెందిన వడ్లకొండ రవీందర్ అందుకున్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు గ్రామాల్లో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ సేకరించిన రక్తాన్ని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు అందించేలా సహకరించినందుకు అవార్డు వచ్చినట్లు రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రెడ్ క్రాస్ ఛైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి, సెక్రటరీ రాధాక్రిష్ణ పాల్గొన్నారు. ఈ అవార్డు ఎంపికకు సహకరించిన వారందరికి రెడ్ క్రాస్ ఛైర్మన్‌కు రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు. రవీందర్‌కు పలువురు అభినం దనలు తెలిపారు.

రోడ్డు పైకి కంప చెట్లు...వాహనదారుల ఇక్కట్లు

● పట్టించుకోని అధికారులు



వెల్గటూర్ - జగిత్యాలరోడ్డు పైకి విస్తరించిన కంప చెట్లు

వెల్గటూర్, జూన్ 14: నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే వెల్గటూర్-జగిత్యాల రోడ్డు పైకి కంప చెట్లు విస్తరించడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. వెల్గటూర్- కుమ్మరిపల్లి మధ్యన కంప చెట్లు రోడ్డు పైకి వచ్చి రాకపోకలు సాగించే వారికి ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చి నపుడు కంప చెట్లతో ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. రాత్రి పూట గమనించక వాహనాలు నడిపే వారికి ప్రమాదం పొంచి ఉన్నది. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే రహదారి పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాల రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందోనని వాహన దారులు మండిపడుతున్నారు. ప్రమాదం జరిగే అవకాశం కళ్లకు కట్టినట్లు కనబడుతున్నా ప ట్టించుకున్న నాథుడే లేడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పైకి వచ్చిన కంప చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

మసీద్‌లలో పారిశుధ్య పనులు చేపట్టాలి

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేత

మెట్‌పల్లి, జూన్, 14 : ఈనెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలోని మసీద్‌లలో పారిశుధ్య పనులను చేపట్టాలని మజీద్ కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్‌కు వినతి ప్రతం అందజేసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 19వరకు నిర్వహించే బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రార్థలను చేసేందుకు మజీద్ వద్దకు పెద్ద ఎత్తున తరలివస్తారన్నారు. మజీద్ వద్దకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా పారిశుధ్య పనులను చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసి కోరామన్నారు. ఈ కార్యక్రమంలో బిస్మిల్లా మజీద్ కమిటీ అధ్యక్షుడు రవుఫ్, మదర్ షా అధ్యక్షుడు జావిద్, ఇజాస్, మతిన్, అఫ్సార్ పాల్గొన్నారు.

పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

జగిత్యాల టౌన్, జూన్ 14: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి శుక్రవారం రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, మెదక్, సిద్ధిపేట జిల్లా కలెక్టర్లతో పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించామని అన్నారు. ప్రస్తుతం పెం డింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యా చరణ చేపట్టాలని, తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్క రించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు.

నులి పురుగుల నివారణకు కృషి చేయాలి

జగిత్యాల టౌన్, జూన్ 14: నులి పురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. 1-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని, ఈ కార్యక్రమాన్ని గురించి విస్తృత ప్రచారం చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో, సామాన్య శాస్త్రం ఉపాధ్యాయులు ఏలిక పాములు సంక్రమణ వల్ల జరిగే దుష్ప్రభావాల గురించి ప్రార్థనా సమావేశాల్లో, తరగతి గదిలో విద్యార్థులకు వివరించి ఈ నెల 20న అందరూ మాత్రలు వేసుకునేలా చూడాలన్నారు.

పాఠశాలలకు మరమ్మతులు..!

● సదుపాయాలు కల్పిస్తే సంఖ్య పెరుగుతుందనే ధీమా ● అమ్మ ఆదర్శ పాఠశాలల నిధులతో మెరుగులు

కథలాపూర్, జూన్ 14:ఏటేటా సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్న క్రమంలో అమ్మ ఆదర్శం పుణ్యమాని పాఠశాలలకు కొత్త శోభ సంతరించుకోనుంది. మౌలిక సదుపాయాలు లేని కారణంగా ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు విముఖత కనబరుస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో విద్యార్థుల్లేని పరిస్థితుల్లో కొన్ని పాఠశాలలను మూసివేశారు. తక్కువ సంఖ్య ఉన్న పాఠశాలలను అదే గ్రామంలోని మరో పాఠశాలలో విలీనం చేసి తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే మూతపడ్డ పాఠశాలలను కూడా అమ్మ ఆదర్శం కింద నిధులు కేటాయించి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు.



కథలాపూర్‌లో కొనసాగుతున్న మరమ్మత్తు పనులు

అమ్మ ఆదర్శ పాఠశాలలకు రూ. 2.13 కోట్లు కేటాయింపు

మండలంలో 30 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 10 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉండగా సుమారు 3800 మంది విద్యార్థులు చదువుతు న్నారు. గత ప్రభుత్వం 16 పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడానికి మన ఊరు మన బడి పథకం కింద నిధులు మంజూరు చేయగా కొంత మేర పనులు పూర్తి చేశారు తాజాగా ప్రభుత్వం మారిన క్రమంలో కొత్త సర్కారు అమ్మ ఆదర్శం పేరిట పాఠశాలలకు కొత్త శోభ తీసుకురావాలనే ఉద్దేశ్యంతో రు. 2.13 కోట్లు కేటాయించింది. బాలికల మరుగుదొడ్లు, తాగునీరు. విద్యుద్దీకరణ వంటి పనులు చేపట్టాలని నిర్ణయించి ఆ పనులను స్థానికంగా ఉన్న నాయకులకు అప్పగించారు. కేవలం పది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలను కూడా మరమ్మతులు చేపడుతున్నారు. మండల కేంద్రంలో ఊరికి దూరంగా చెట్ల పొదల్లో నిర్మించిన ఎస్‌సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో పట్టుమని పది మంది విద్యార్థులు కూడా లేరు. నాలుగు సంవత్సరాల కిందటే ఈ పాఠశాలలను మూసివేశారు. గ్రామంలో మరో ప్రాథమిక పాఠశాలలోనే విలీనం చేసి తరగతులు కొనసాగిస్తున్నారు. పాఠశాలలను మూసివేయడంతో మరుగుదొడ్లు పూర్తిగా శిధిలావస్థకు చేరుకున్నాయి. ఫ్లోరింగ్ దెబ్బతిని నడవడానికి కూడా వీలులేకుండా మారింది. తాజాగా ఈ పాఠశాలకు సుమారు రూ. 5 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయిస్తున్నారు. పోతారం గిరిజన తండా పాఠశాలలో 10, తాండ్ర్యాల బీసీ కాలనీలో 5 గురు, కలికోటలో 10, భూషణరావుపేట బీసీ కాలనీలో 10 మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. ఈ ఏడాది



శిథిలమైన మరుగుదొడ్లు

ఎంత మంది విద్యార్థులు అడ్మిషన్ పొందుతారో తెలియని పరిస్థితి ఉంది. ఈ పాఠశాలలకు కూడా లక్షలాది రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేయిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టిందని పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో గుర్తించిన పనులు చేపడితే మేలు

అల్లె పరమేశ్వర్, హెచ్‌ఎం దూలూరు



పాఠశాలల్లో ఎలాంటి అవసరాలు ఉన్నాయనేది మొదట ఉపాధ్యాయులతో చర్చ చేయాలి. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు గుర్తించి వాటికే నిధులు కేటాయించాలి. దూలూరులో మధ్యాహ్న భోజనం కోసం నిర్మించిన గది పూర్తిగా కూలిపోయింది. ఆ గది నిర్మిస్తే నిర్వాహకులకు ఇబ్బందులు తొలగిపోతాయి. భోజనం సక్రమంగా పెడితే విద్యార్థుల సంఖ్య పెరగడానికి అవకాశం ఉంది.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

● ప్రోటోకాల్‌ను అధికారులు తప్పని సరిగా పాటించాలి

● కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, జూన్, 14 : గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. శుక్రవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. మండలంలోని అభివృద్ధి, సంక్షేమ పనులపై ఆయా శాఖల అధికారులు సమావేశంలో తెలియజేశారు. ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని వేంపేట గ్రామంలో ఉపాధ్యాయులు నిర్వహించడం లేదని ఎంపీటీసీ పుల్ల చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. ఉపాధ్యాయులు బడిబాటను నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేర్పించాలని ఎమ్మెల్యే ఆదేశించాడు. గ్రామాల్లో ఉపకాలువలు, చెరువులు, కుంటలు కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని ఎంపీపీ మారు సాయిరెడ్డి, పెద్దాపూర్ ఎంపీటీసీ శంకరయ్యలు ఇరిగేషన్ అధికారిని నిలదీశారు. ఎమ్మెల్యే కలుగజేసుకొని గ్రామాల్లోని చెరువులు, కుంటుల, ఉపకాలువలు కాపాడాల్సిన బాధ్యత అధికారులది, కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఆరోగ్య లక్ష్మీ పథకం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రతి రోజు ఒక గుడ్డుతో పాటు భోజనం పెట్టడం, పాలు ఇవ్వడం లేదని, తక్కువ పరిమాణం ఉన్న గుడ్డును అందజేస్తున్నారని, సీడీపీవో తిరుమల దేవి విధుల్లో నిర్లక్ష్యం చూపుతున్నారని, సూపర్ వైజర్లు అంగన్ వాడీ కేంద్రాలను పరిశీలించడం లేదని ఎల్ఎస్‌సీఎస్ ఛైర్మన్ కొమిరెడ్డి తిరుపతి సమస్యను సభలో లేవనెత్తారు. దీంతో ఎమ్మెల్యే కలుగ చేసుకొని తప్పకుండా అంగన్ వాడీల కేంద్రాలను తనిఖీ చేసి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులకు తెలయజేద్దామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విధుల నిర్వహణలో అధికారులు అంకిత భావంతో పనిచేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

ప్రోటోకాల్ ప్రకారం గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు విలువలు ఇవ్వాలని, తప్పని సరిగా అధికారుల ప్రొటోకాల్‌ను పాటించాలని లేకుంటే ఈ అంశాన్ని ఉన్నతాధికారిల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కాటిపల్లి రాధ-శ్రీనివాస్‌రెడ్డి, ఇంచార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యుడు, అధికారులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై వాడివేడిగా చర్చ..

గ్రామాల్లో ఎంపీటీసీల పట్ల అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, రాజకీయ నాయకులు గ్రామాల్లోకి వచ్చిన సమయంలో కూడా తెలపడం లేదని మేడిపల్లి గుండెల నగేష్ సర్వసభ్య సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రొటోకాల్ అంశంపై మాట్లాడుతుండగా మధ్యలో ఎంపీటీసీ కలుగజేసుకున్నారు. దీంతో ఎంపీటీసీ తీరు బాగాలేదని ఎదుటివారు చెప్పేవరకు వినే సంస్కారం లేకుండా మధ్యలో మాట్లాడడం సరికాదన్నారు. తోటి ఎంపీటీసీలు కలుగ జేసుకుని ఎమ్మెల్యేకు సారి చెప్పారు.

ఎస్‌సీ కార్పొరేషన్ ఈడీ బాధ్యతల స్వీకరణ

జగిత్యాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ఎస్‌సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా జిల్లా ఎస్‌సీ సంక్షేమ అధికారి రాజుకుమార్ బాధ్యతలను చేపట్టారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్‌లో గల ఎస్‌సీ కార్పొరేషన్ కార్యాలయంలో రాజుకుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్తున్న ఈడీ లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా పూలమొక్కను రాజుకుమార్‌కు అందించి అభినందించారు. పలువురు ఎస్‌సీ కార్పోరేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్, జూన్ 14 : జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం, తాటిపల్లి సబ్‌స్టేషన్ లలో మరమ్మతుల దృష్ట్యా ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని అంతర్గాం, అంబారిపేట్, ఒడ్డెరకాలనీ, తాటిపల్లి గ్రామాలలో శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చల్‌గల్ ఏఈ సుందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

● **కోరుట్ల రూరల్ :** మండలంలోని అయిలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 15న విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని శుక్రవారం ట్రాన్స్‌కో మండల ఏఈ భూక్య శ్రీనివాస్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌రావుపల్లి, అయిలాపూర్, తిమ్మయ్యపల్లి, యూసుఫ్‌నగర్ గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని తెలిపారు. వినియోగదారులు సహకారం అందించాలని ఏఈ కోరారు.

మెట్‌పల్లి : వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ -2 శుక్రవారం తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్, వెల్లుల్ల రోడు, డిపో, శాంతినగర్, సాయికృష్ణ, మహాలక్ష్మినగర్, బీడీ కాలనీ, పోస్టు ఆఫీస్, రేగుంట రోడ్డు, సింగపూర్, ఇంద్రనగర్, అంబేద్కర్ నగర్, మఠంవాడ, లైబ్రరీ, కూరగాయల మార్కెట్, చైతన్యనగర్, ఏకలవ్యనగర్, సాయిరామ్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సరహకరించాలని కోరారు.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు

కోరుట్ల రూరల్, జూన్ 14 : మండలంలోని చిన్న మెట్‌పల్లి గ్రామంలోని కాలభైరవుడికి శుక్రవారం ప్రత్యేక పూజలను అర్చకులు చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. అష్టమి పర్వదినం పురస్కరించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యతను పరిశీలించిన అధికారులు

పెగడపల్లి, జూన్ 14 :మండల కేంద్రంలో నిర్మించిన రోడ్డు నాణ్యత ప్రమాణాలను ఆ శాఖ అధికారులు శుక్ర వారం పరిశీలించారు. మండల కేంద్రంలోని నంది కూడ లి నుంచి పోలీస్ స్టేషన్ సమీపంలోని వైష్ణవి పాఠశాల సమీపం వరకు గల రోడ్డును నాలుగు వరుసల రహ దారి నిర్మాణంతో పాటు సెంట్ర్ లైటింగ్ రోడ్డు నిర్మాణా నికి గాను రాష్ట్ర ప్రభుత్వం రూ. 2.2 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పాక్షికంగా పనులు చేయగా శుక్రవారం ఆ శాఖ అధికారులు పనులు పరిశీలించి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ సామ్యూల్, డీఈ సత్యనారాయణ, ఏఈలు ఆది త్య, రవి తదితరులు పాల్గొన్నారు,

అర్హులకే నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

యూత్ కాంగ్రెస్ నిజామాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ గోరుమంతుల ప్రవీణ్‌కుమార్

మెట్‌పల్లి రూరల్, జూన్, 14: కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకున్నా, ఎన్ని అవమానాలు ఎదురైనా ఆర్థిక ఇబ్బందులు వచ్చినా అహర్నిశలు కష్టపడి పార్టీ గెలుపు కోసం శ్రమించిన నిజమైనా కార్యకర్తలకు గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ నిజామాబాదు పార్లమెంట్ కోఆర్డినేటర్ గోరు మంతుల ప్రవీణ్ కుమార్ కోరారు. శుక్రవారం వేంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సొంత లాభాల కోసం ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు, భజనపరులకు నామినేటెడ్ పదవులు ఇస్తే పార్టీ భవిష్యత్తు నాశమవుతుందన్నారు. గత బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్ని ఇబ్బందులు పెట్టిన పార్టీలోకి వస్తే పదవులు ఇస్తామని తెలిపిన కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని పని చేసిన నిజమైన నాయకులను గుర్తించాలని, పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కార్యకర్తలకు అవకాశాలు కల్పించాల్సిన అవసరం నాయకత్వంపై ఉందన్నారు. గత పది ఏళ్లలో ఎన్నో అవమానాలు, కేసులతో పాటు ఆర్థిక ఇబ్బందులకు గురైనా పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులతో పాటు గౌరవం ఇవ్వాలన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

మల్లాపూర్, జూన్, 14: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మల్లాపూర్ ఏఎస్సై లక్ష్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సాతారం నుంచి మెట్‌పల్లికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. కొంత మంది ఇసుక వ్యాపారులు తప్పించుకున్నారని, పట్టుకున్న ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మండలం నుంచి అక్రమంగా మట్టి, ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుంతను పూడ్చిన పంచాయతీ కార్మికులు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మల్లాపూర్, జూన్, 14 : మండల కేంద్రంలోని రోడ్డులో మిషన్ భగీరథ పైపు కోసం తవ్విన గుంతను పంచాయతీ కార్మికులు పూడ్చివేశారు. ప్రమాదకరంగా గుంత...మరమ్మతులు చేయని అధికారులు...రాకపోకలకు ప్రజల అవస్థలు...అని శుక్రవారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు చేసి గుంతను పూడ్చివేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో భాగంగా పైపు లీకేజీ అయింది. దీంతో పైపు మరమ్మతుల కోసం పది రోజుల క్రితం తవ్విన గుంతతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో కాలనీ వాసులు ఆంధ్రజ్యోతి దృష్టికి తీసుకరావడం జరిగింది. పత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారలు స్పందించి మరమ్మతులు చేపట్టి తవ్విన గుంతను పూడ్చి వేశారు. దీంతో కాలనీ వాసులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చిన పంచాయతీ కార్మికులు

మృతుడి కుటుంబానికి పరామర్శ

రాయికల్, జూన్ 14: మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన కండ్లపెల్లి సాయి కుమార్ ఈ నెల 5న రోడ్డు ప్రమాదంలో మరణించగా ధర్మ సమాజ్ పార్టీ నాయకులు గురువారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ దూడ తిరుపతి, డీఎస్‌పి రాయికల్ మండల కన్వీనర్ జీవన్, రంజిత్, రామ్, ప్రణయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లలో మోస్తరు వర్షం

కోరుట్ల, జూన్ 14 : పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో మోస్తారు వర్షం కురిసింది. భారీ శబ్దంతో ఉరుములు ఉరమడంతో పా టు మెరుపులు మెరవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దీనికి తోడు కొంత మేర గాలి వీయడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఉక్క పోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పట్టణ వాసులు వర్షం కురవంతో వాతావరణం కొంత మేర చల్లబడడంతో ప్రజలు ఉపిరి పీల్చుకున్నారు.

కళాశాల మైదానానికి స్థలం కేటాయింపు ఎప్పుడో..?

● ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు

● బుట్టదాఖలైన నేతల హామీలు

కథలాపూర్, జూన్ 14 : క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయని నేతలు సభల్లో చెబుతున్నా ఊకదంపుడు ఉపన్యాసాలకే పరిమితమవుతున్నాయి. చదువుతో పాటు క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరం కాగా జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఆ ఆటలు ఆడుకునేందుకు స్థలమే లేకపోతే అనుకున్న లక్ష్యం చేరడానికి అవకాశాలు కోల్పోవాల్సిన దుస్థితి కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎదురైంది. స్థలం కేటాయింపు కోసం ఎన్ని వినతి పత్రాలు అందించినా ఫలితం శూన్యమే అవుతోందనే విమర్శలు వస్తున్నాయి.

● గ్రామీణ క్రీడల పట్ల నిర్లక్ష్యం

ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా గ్రామీణ విద్యార్థుల క్రీడల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తూనే ఉన్నాయి. ఇంటర్ దశలో చదువు ఎంత ప్రధానమో క్రీడల పట్ల కూడా విద్యార్థులు అదే స్థాయిలో ఆసక్తి కనబరుస్తుంటారు. క్రీడా మైదానాలే లేకపోవడంతో ఆటలకు దూరమవడంతో పాటు ఆసక్తి సన్నగిల్లుతుంది. కథలాపూర్‌లో గత పదేళ్ల కిందట ప్రభుత్వం జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసింది. ఆ సమయంలో తాత్కాలికంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షిఫ్టింగ్ పద్ధతిలో కళాశాల తరగతులను నిర్వహించారు. ఇటీవల నూతన భవనంలోకి మారడంతో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 250 మంది విద్యార్థులు చదవుకుంటున్నారు. కళాశాలకు ఇప్పటికీ క్రీడా మైదానానికి ప్రభుత్వం



కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

స్థలం కేటాయించలేదు. పక్కనే ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నా అధికారికంగా స్థలం కేటాయించడంలో విపరీత జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో విద్యార్థులు ఆటల్లో వెనకబడిపోయి రాష్ట్ర, జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశాలను కోల్పోవాల్సిన పరిస్థితి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా క్రీడా మైదానానికి స్థలం కేటాయించడంపై నాయకులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

కొడిమ్యాల, జూన్ 14 : మండలంలోని వివిద గ్రామాల్లో బడిబాట కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం చిన్నారులకు సామూహిక అక్షరా భ్యాసం, ఉచిత దుస్తులు, నోట్ బుక్‌ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండలంలోని నల్లగొండలో ప్రత్యేక అధికారి పి. ప్రసాద్, ఎంపీటీసీ సిందు మహేందర్‌గౌడ్, ప్రధానోపా ధ్యాయులు శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.